క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి పర్యటన



సదుం: ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గురువారం సదుం మండలంలో పర్యటించనున్నట్టు ఆయన కార్యాలయం ప్రతినిధులు తెలిపారు. ముందుగా ఎర్రాతివారిపల్లిలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి బాబు షూరిటీ–మోసం గారెంటీ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. వైఎస్సార్ సీపీ శ్రేణులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

నేడు మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం

చౌడేపల్లె: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించాలని ఎంఈవో కేశవరెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి పిల్లల తల్లిదండ్రులు, కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు విధిగా హాజరై పాఠశాల అభివృద్ధికి చేపట్టనున్న కార్యక్రమాలపై చర్చించాలని సూచించారు. ఈ సమావేశాల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించామన్నారు.

నేడు గురుపౌర్ణమి వేడుకలు

సదుం: మండల కేంద్రమైన సదుంలో వున్న సాయిమందిరంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఉదయం బాబాకు ప్రత్యేక పూజలు చేస్తామని తెలిపారు. అనంతరం పాలాభిషేకం, భజనలు, మధ్యాహ్నం అన్నదానం చేస్తున్నట్టు తెలిపారు.

నేడు, రేపు అఖండ రామకోటి మహా యజ్ఞం

వి.కోట: మండలంలో నాయకనేరి అటవీ ప్రాంతంలో వున్న అభయాంజనేయస్వామి ఆలయంలో గురు, శుక్రవారాలు అఖండ రామకోటి మహా యజ్ఞం నిర్వహించనున్నట్టు బోయచిన్నాగనపల్లి పంచాయతీ ప్రజలు తెలిపారు. వారు మాట్లాడుతూ గురుపౌర్ణమిని పురస్కరించుకుని అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తామని తెలిపారు. అనంతరం ఆలయం వద్ద ప్రత్యేక బృందాలతో అఖండ భజన నిర్వహిస్తామని పేర్కొన్నారు. అలాగే ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

బ్యాంకు ఉద్యోగుల ధర్నా



పుంగనూరు (చౌడేపల్లె) : పుంగనూరు పట్టణంలోని సెంటర్ లాడ్జిలో వున్న కేంద్ర సహకార బ్యాంకు ఉద్యోగులు బుధవారం ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. దీంతో కార్మికులు, ఉద్యోగులు తమ హక్కులు కోల్పోతున్నారని పేర్కొన్నారు. దీనిని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మెకు మద్దతు తెలుపుతున్నట్టు తెలిపారు.

సింగిల్‌విండోకు ఇన్‌చార్జిల నియామకం

వి.కోట: మండలంలోని రెండు సింగిల్‌విండోలకు పర్సన్ ఇన్‌చార్జిలను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో వి.కోట పీఏసీఎస్ చైర్మన్‌గా మాజీ ఎంపీటీసీ నారాయణస్వామి, ముదరందొడ్డి సింగిల్‌విండో చైర్మన్‌గా హరినాథ్‌రెడ్డి నియమితులయ్యారు. అలాగే డైరెక్టర్లుగా మూర్తి, జయప్ప, రాధాకృష్ణ, చిన్నప్ప నియమితులయ్యారు.

వైభవంగా అక్షరాభ్యాసం



పిల్లలతో అక్షరాభ్యాసం చేయిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు చంద్రశేఖర్ దంపతులు

పెద్దపంజాణి: మండలంలోని బనకందొడ్డి గ్రామంలో విశ్రాంత ఉపాధ్యాయులు చంద్రశేఖర్, ఉమామహేశ్వరి దంపతుల ఆధ్వర్యంలో బుధవారం పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. గ్రామంలోని శివాలయంలో అర్చకుల ద్వారా 100 మంది 1వ తరగతి విద్యార్థులకు ఉచితంగా విద్యాసామగ్రి పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని గత 15 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బీఎల్‌వోలకు శిక్షణ



మాట్లాడుతున్న డీటీ మోహన్

పుంగనూరు(చౌడేపల్లె): ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు పుంగనూరు పట్టణంలోని ట్రావెలర్స్ బంగ్లాలో బుధవారం బీఎల్‌వోలకు శిక్షణ ఇచ్చినట్టు డీటీ మోహన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది విధులను బాధ్యతగా నిర్వహించాలన్నారు. ఫారం 6, 7 లపై అవగాహన కల్పించారు. ఓటర్ల జాబితాను తప్పులు లేకుండా సిద్ధం చేయాలని సూచించారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమరోత్సాహం

- పోలీసు ఆంక్షలను లెక్కచేయని జనం
- నోటీసులు ఇచ్చినా భయపడని వైనం
- జనసంద్రంగా మారిన బంగారుపాళ్యం



మార్కెట్ యార్డులో మాట్లాడుతున్న జగన్‌మోహన్ రెడ్డి పక్కన మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్



అశేష జనవాహినికి అభివాదం చేస్తున్న వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి (ఇన్‌సెట్) పార్టీ జెండాతో మహిళ ఆనందం

పలమనేరు: మామిడి రైతులకు అండగా నిలిచి గిట్టుబాటు ధర కల్పించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం బంగారుపాళ్యం వచ్చారు. ఆయన పర్యటనను విజయవంతం కాకుండా చేయాలని కూటమి ప్రభుత్వం చేసిన కుట్రలను వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు, రైతులు భగ్నం చేశారు. పోలీసులు అడుగడుగునా ఆంక్షలు విధించినా, కేసులు పెడతామని నోటీసులు ఇచ్చినా లెక్కచేయకుండా బంగారుపాళ్యం మామిడి కాయల మార్కెట్‌కు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మార్కెట్ యార్డు ఎటు చూసినా జనంతో కిక్కిరిసింది.

బెడిసికొట్టిన ప్లాన్లు

రైతులు, ప్రజలు రాకుండా గతంలో ఎన్నడూ లేనివిధంగా పోలీసులు ఆంక్షలు విధించారు. వేలాది మంది పోలీసులతో ఎక్కడికక్కడ తనిఖీలు చేపట్టారు. బస్సులను ఆపి చెక్ చేశారు. బైక్‌లను అడ్డుకున్నారు. ప్రయాణికులతో వెళుతున్న బస్సులను సైతం సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. దీనికితోడు బంగారుపాళెం మార్కెట్‌లో రైతులు లేకుండా రాత్రికి రాత్రే అందరినీ పంపించేశారు. కనీసం మండీల యజమానులు సైతం కనిపించకుండా చేశారు. మామిడి రైతులు నేరుగా వచ్చి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి తమ కష్టాలు చెప్పుకున్నారు.

ముందస్తు నోటీసులు, బైండోవర్లు

బంగారుపాళెం పర్యటనకు వైఎస్సార్ సీపీ నేతలు రాకుండా మండలాల పోలీసులు మంగళవారమే నోటీసులు ఇచ్చారు. బుధవారం సైతం కొందరు నాయకులను బైండోవర్ చేసి స్టేషన్లలో పెట్టారు. అయినా బెదరకుండా కార్యక్రమానికి వచ్చి విజయవంతం చేశారు. ఎన్ని ఆంక్షలు పెట్టినా జనసందోహం రావడం చూసి కూటమి నేతల గుండెల్లో గుబులు పట్టుకుంది.



రావడానికి వీల్లేదు: బంగారుపాళ్యం మార్కెట్ గేట్లు మూసేయడంతో బయటే వున్న రైతులు, ప్రజలు



జగనన్నను చూడాలని..



అదిగదిగో జగనన్న వస్తున్నాడు..



ధరలేక మామిడి కాయలను రోడ్డుపై పోసి నిరసన



పోలీసులు నిలిపేసిన బస్సులు



జగన్ వస్తున్నారని : బంగారుపాళ్యం మార్కెట్‌లో వ్యాపారులు, రైతులను ఖాళీ చేయించిన పోలీసులు







ఇటు ఎవరినీ వెళ్లనీయం: ప్రజలు, రైతులు జగన్ పర్యటనకు వెళ్లకుండా అడ్డుకుంటున్న పోలీసులు



జగనన్నకు బాధలు చెప్పుకోవాలని మహిళల పరుగులు

ఎక్కడికక్కడ కార్యకర్తల నిర్బంధం



గంగవరం : గాంధీనగర్ టర్నింగ్ పాయింట్ వద్ద వాహనాలను అడ్డుకుంటున్న పోలీసులు



రొంపిచెర్ల : పెద్దమల్లెల నుంచి మంగళవారం రాత్రి బంగారుపాళ్యం బయలుదేరిన నాయకులు

గంగవరం: మామిడి రైతులకు అండగా నిలిచేందుకు బంగారుపాళ్యం వచ్చిన మాజీ సీఎం జగనన్న కార్యక్రమానికి బయలుదేరిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు, అభిమానులు, రైతులను పోలీసులు ఎక్కడికక్కడ నిర్బంధించారు. చిత్తూరు హైవేలో గంగవరం సమీపంలోని గాంధీనగర్ టర్నింగ్ పాయింట్ వద్ద పోలీసులు భారీగా మోహరించారు. బంగారుపాళ్యం వైపు వెళ్తున్న ప్రతి ఒక్కరినీ అడ్డగించారు. ప్రయాణికులతో చిత్తూరుకు బయలుదేరిన ఓ ప్రైవేట్ బస్సును సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ప్రయాణికుల్లో పలువురు ఆస్పత్రులకు, ఇతరత్రాలకు తప్ప జగన్ కార్యక్రమానికి తాము వెళ్లడం లేదని ఎంత మొత్తుకున్నా వినలేదు. దీంతో వారు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అభిమానులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు పోలీసుల ఆంక్షలను లెక్కచేయకుండా పొలాలు, అటవీ మార్గాల్లో అతి కష్టం మీద బంగారుపాళ్యం చేరుకున్నారు.

పోలీసుల ఆంక్షలను లెక్కచేయని కార్యకర్తలు

రొంపిచెర్ల: బంగారు పాళ్యం మార్కెట్ యార్డులో జరిగిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి పర్యటనకు వెళ్లకుండా చేయాలని పోలీసులు పెట్టిన ఆంక్షలను పెట్టిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు లెక్కచేయలేదు. రొంపిచెర్ల మండలం నుంచి పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. మంగళవారం రాత్రి 12 నుంచి తెల్లవారుజామున 5 లోపే కార్యకర్తలు వివిధ మార్గాల్లో బంగారుపాళెం చేరుకున్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల నియామకాలు

పలమనేరు: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం ఆ పార్టీ పలమనేరు మండల అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. యూత్‌వింగ్‌కు గోవిందురెడ్డి, మహిళా విభాగానికి లావణ్య, రైతు విభాగానికి వెంకటరమణారెడ్డి, బీసీ సెల్‌కు ఏకాంబరం, ఎస్సీసెల్‌కు వేలు, ఎస్టీ సెల్‌కు రామచంద్ర, మైనారిటీ సెల్‌కు షరీఫ్, స్టూడెంట్ వింగ్‌కు కలికుమార్, పీఆర్‌కు ఈశ్వర్‌రెడ్డి, ఆర్‌టీఐకు రాజశేఖర్, వలంటీర్స్‌కు ప్రకాష్, గ్రీవెన్స్‌కు త్రివిక్రం, వాణిజ్యానికి రమేష్, వైఎస్సార్‌టీయూసీకి గణేష్, కల్చరల్‌కు మునిరత్నం, సోషల్ మీడియాకు కిరణ్‌కుమార్, ఐటీకి మహేష్, మేధావుల ఫోరానికి విజయకుమార్, పబ్లిసిటీకి నరేంద్రయాదవ్, డాక్టర్స్‌కు రఘు, బూత్ కమిటీలకు తిరుమల నాయుడు నియమితులయ్యారు. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ వారికి సూచించారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి



పుంగనూరు ఐసీడీఎస్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



మానవ హారం చేసిన అంగన్‌వాడీ కార్యకర్తలు

పుంగనూరు(చౌడేపల్లె): సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు డిమాండ్ చేశారు. వారు బుధవారం రాంపల్లె వద్దనున్న ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలను కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందన్నారు. యాప్ పేరిట తిప్పలు తప్పంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పని ఒత్తిడి తగ్గించాలని డిమాండు చేశారు. తమకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. అనంతరం సీడీపీవో రాజేశ్వరికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఉద్యోగులు ప్రేమకుమారి, లలిత, జయమ్మ, శాంతమ్మ, శైలజ, సులోచన, నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై చిన్నచూపు వద్దు

బైరెడ్డిపల్లె : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు డిమాండ్ చేశారు. వారు బుధవారం హామీలు నెరవేర్చాలని కోరుతూ బైరెడ్డిపల్లెలో నిరసన తెలిపారు. అనంతరం ర్యాలీగా చెక్‌పోస్టు కూడలి వద్దకు చేరుకుని మానవ హారం ఏర్పాటుచేశారు. వారు మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రూ.26 వేతనం ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఇప్పటికైనా హామీలను నెరవేర్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెంకటరత్నమ్మ, శకుంతల, నాగవేణి, రోజ, లక్ష్మీదేవి, రమ్య, లీలావతమ్మ, ఇందిరమ్మ, పద్మావతి, రూప తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్ల నిరసన

కుప్పం: దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో లక్ష్మీపురంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ వర్కర్లపై ప్రభుత్వం చిన్న చూపు చూడడం తగదని విమర్శించారు.

లేబర్ కోడ్స్ రద్దు చేయాలి



పుంగనూరులో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

పుంగనూరు(చౌడేపల్లె): లేబర్ కోడ్ 2020 చట్టాన్ని రద్దు చేసి, భవన కార్మికుల కోసం 1996 చట్టాన్ని పునరుద్ధరించాలని ఏపీ డబ్ల్యూజేఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. వారు బుధవారం భవన నిర్మాణ కార్మికులకు మద్దతుగా పుంగనూరు పట్టణంలోని అంబేడ్కర్ కూడలి వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ జర్నలిస్టులను కూడా అసంఘటిత కార్మికులుగా గుర్తించి కేంద్ర ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలన్నారు. వర్కింగ్ జర్నలిస్టులకు 1955 చట్టాన్ని అమలు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. అలాగే సీపీఐ ఆధ్వర్యంలో ప్రజా సంఘాలు అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. సీపీఐ కార్యదర్శి రామమమూర్తి, ఏఐటీయూసీ అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ గతంలో ఉన్న కార్మిక చట్టాలను రద్దు చేసి కొత్త చట్టాలను తీసుకురావడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. గతంలో ఉన్న చట్టాలనే తిరిగి పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు సలీం, సతీష్, మురళీ, అప్ప, రెడ్డెప్ప, బాబు, కార్మికులు సురేష్, సుధాకర్, కుమార్, రమణ, బాలాజీ, వెంకటేష్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

వి.కోట: లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలని పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. వారు బుధవారం వి.కోట మేజర్ పంచాయతీ సచివాలయ–1 వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 ఇవ్వాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాలు భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

చట్టాలు పునరుద్ధరించాలని వినతి

సదుం: కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన 44 కార్మిక చట్టాలను, జర్నలిస్టుల వేతన చెల్లింపు చట్టాన్ని పునరుద్ధరించాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు తెలిపారు. వారు బుధవారం కార్మికులు చేస్తున్న నిరసనకు మద్దతు తెలిపారు. అనంతరం తహసీల్దార్ ప్రమీలకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, జర్నలిస్టులను అసంఘటిత కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

రైతులను ఆదుకుంటాం

గుడుపల్లె : మండలంలోని మారికుప్పం నుంచి ద్రవిడ వర్సిటీ మీదుగా కుప్పం వరకు నిర్మిస్తున్న రైల్వే లైన్ల కోసం భూములు కోల్పోయిన రైతులను ఆదుకుంటామని జాయింట్ కలెక్టర్ విద్యాధరి తెలిపారు. ఆమె బుధవారం రాళ్లగంగమాంబ ఆలయం వద్ద రైల్వే లైనుకు భూములు ఇచ్చిన రైతులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ గతంలో రైల్వే లైన్లకు భూములు ఇచ్చిన రైతుల ఖాతాల్లో నగదు జమ చేశామన్నారు. ఆ భూముల్లో ఉన్న మల్బరి తోటలు, బోరు బావులు, షెడ్డులతో పాటు వివిధ చెట్లకు కలెక్టర్‌తో చర్చించి పరిహారం అందజేస్తామని హామీ ఇచ్చారు. భూములు కోల్పోయిన రైతులందరికీ నగదు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరాజు, తహసీల్దార్ సీతారాం పాల్గొన్నారు.

అర్హులందరికీ అన్నదాత సుఖీభవ

పెద్దపంజాణి: అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతుల వివరాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నట్టు పుంగనూరు ఏడీఏ శివకుమార్, ఏవో హేమలత తెలిపారు. ఆయన బుధవారం రాయలపేటలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అర్హత కలిగి, జాబితాలో పేర్లు లేని రైతులు ఆర్‌ఎస్‌కే ఇన్‌చార్జి లాగిన్‌లో గ్రీవెన్స్ అప్‌లోడ్ చేయాలని సూచించారు. అనంతరం వేరుశనగ సాగులో తీసుకోవాల్సిన మెళకువలు, యూరియా వాడకంపై అవగాహన కల్పించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

బైరెడ్డిపల్లె : గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డలు సంపూర్ణ ఆరోగ్యంగా వుంటారని వైద్యాధికారి విజయ్‌చంద్ర తెలిపారు. ఆయన బుధవారం ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమం కింద మహతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారం అందించారు. ఆయన మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. గర్భిణులు ఒత్తిళ్లకు లోనుకాకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



బైరెడ్డిపల్లె : పౌష్టికాహారం అందజేస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు

సమతుల ఆహారం తీసుకోవాలి

పులిచెర్ల(కల్లూరు) : గర్భిణులు సమతుల ఆహారం తీసుకోవాలని పులిచెర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ అపర్ణ తెలిపారు. వారు బుధవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. వారు మాట్లాడుతూ ఆకు కూరలు, గుడ్లు ఎక్కువగా తీసుకోవాలన్నారు. తద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకురాలు ప్రమీల, యశోద తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులు సురక్షితం

రొంపిచెర్ల: గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు చేసుకోవాలని రొంపిచెర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి వినయ్ తెలిపారు.



రొంపిచెర్ల పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్

ఆయన బుధవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులు సురక్షితమన్నారు. ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. పుట్టిన బిడ్డకు టీకాలు వేయడంతోపాటు జనన ధ్రువీకరణ పత్రం మంజూరు చేస్తామని వెల్లడించారు. ప్రతి నెలా 9న గర్భిణులు పరీక్షలు చేసుకోవాలన్నారు. పాలు, కోడి గుడ్లు, ఆకు కూరలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సూపర్‌వైజర్ పంకజ పాల్గొన్నారు.